ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసుల నిర్బంధం దారుణం

భీమవరం:కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైస్‌చాన్సలర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన విద్యార్థిసంఘం నాయకులపై పోలీసుల దురాగతాన్ని డివైఎఫ్ఐ జిల్లాకమిటీ తీవ్రంగా ఖండించింది. ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసుల కక్షసాధింపు సరికాదని విమర్శించింది. ఈ మేరకు బుధవారం డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల ధనుష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌కుమార్‌పై భౌతికదాడికి దిగిన పోలీసు అధికారులపై ఉన్నత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పవన్‌కుమార్ దుస్తులు సైతం ఊడేలా బయటకు ఈడ్చేశారని విమర్శించారు. దాడిలో గాయపడిన పవన్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలించడానికి వచ్చిన 108 అంబులెన్సును లోపలికి రాకుండా అడ్డుకున్న పోలీసుల తీరు దారుణమని మండిపడ్డారు. దాడికి పాల్పడిన పోలీసు అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీ విద్యార్థుల సమస్యలను యాజమాన్యం తక్షణం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ సాగిస్తున్న పోరాటానికి డివైఎఫ్ఐ సంపూర్ణ మద్దతుతో ఐక్య పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

రుచిగా లేకపోతే ఎలా తింటారు

మధ్యాహ్న భోజన నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఉండి

'మధ్యాహ్న భోజనం ఇలా ఉంటే ఎవరు తింటారు..? కనీసం మీరైనా తింటారా? అయితే పిల్లలు స్కూల్లో భోజనం చేసేందుకు ఆసక్తి చూపడం లేదు' అంటూ ఉపాధ్యాయులపై, నిర్వాహకులపై కలెక్టర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత నాడు-నేడు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తొలుత పాఠశాలల్లో ఆడపిల్లల మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం తయారు చేశారా లేదా అని ప్రశ్నించారు. పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థులుండగా కేవలం 150 మంది మాత్రమే పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని కలెక్టర్ గుర్తించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు జగనన్న గోరుముద్దపై అవగాహన కల్పించి విద్యార్థులందరూ పాఠశాలలోనే తినేలాగా చూడాలని ఉపాధ్యాయులను కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం ఆహార పదార్థాలను రుచి చూసి భోజనం నాణ్యత, రుచిగా తయారు చేయాలని ఈ విధంగా తయారు చేస్తే ఎవరు తింటారని ప్రశ్నించారు. ఆయాలతో మాట్లాడుతూ మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన ద్వారా వచ్చే అనర్థాలపై ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్, ఎంఇఒ ఎ.రవీంద్ర, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరస్వామినాయుడు, ఆర్ఐ వి.ఆంజనేయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్

డ్రోన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అత్యాధునిక డ్రోన్లతో రీ సర్వే : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - ఉండి

అత్యాధునిక డ్రోన్లను ఉపయోగించి ఖచ్చితమైన రికార్డులతో భూ రీ సర్వే పనులను వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం మండలంలోని మహదేవపట్నంలో నిర్వహిస్తున్న రీ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేయడంతో పాటు ఖచ్చితమైన రికార్డులను రూపొందించాలన్నారు. రీసర్వే సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు రైతులందరూ తమ పాస్ పుస్తకాలు, డాక్యుమెంట్లతో సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు. రీ సర్వే వల్ల సరిహద్దు తగాదాలకు స్వస్తి పలకొచ్చని ఆమె తెలిపారు. రీ సర్వేకు అత్యంత ఆధునిక డ్రోన్లను ఉపయోగిస్తున్నట్లు వారు తెలిపారు. అధికారులు రీ సర్వే పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పూర్తిచేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరస్వామినాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వి.ఆంజనేయులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

లోటుపాట్లు లేకుండా ఎంఎల్‌సి ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - భీమవరం

ఎంఎల్‌సి ఎన్నికలు ఎలాంటి లోటుపాట్లుకు తావులేని విధంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ మాస్టర్ ట్రైనర్ మోహన్‌కుమార్ తెలిపారు. బుధవారం వెలగపూడి సచివాలయం ఐదో బ్లాక్ చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి కార్యాలయం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ మాస్టర్ ట్రైనర్ మోహన్ కుమార్ రాష్ట్రంలోని ఎన్నికల నిర్వహణ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుచి డిఆర్ఒ కె.కృష్ణవేణి, నోడల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, పోలీస్, ఆర్‌టిసి, రవాణా అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 16న జారీ అవుతుందని, ఈ నెల 23 వరకూ నామినేషన్లు స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. నామినేషన్లు ఉపసంహరణకు చివరి తేదీ ఈ నెల 27 అని తెలిపారు. మార్చి 13వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు మార్చి 16వ తేదీన ఉంటుందని, ఎన్నికల ప్రక్రియ మార్చి 21 నాటితో పూర్తవుతుందని డిఆర్ఒ తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు, భద్రతాపరమైన ఏర్పాట్లను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 430 మంది ఓటర్లు ఉన్నారని, భీమవరం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లు, నరసాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 229 ఓట్లు మొత్తం 430 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎపిఎస్ ఆర్‌టిసి భీమవరం డిటిఒ వీరయ్య చౌదరి, సివిల్ సప్లయిస్ డిటి శివరామ ప్రసాద్, మెప్మా పీడీ జి.లక్ష్మీపార్వతి, పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులు, నోడల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, పాల్గొన్నారు

అత్యవసర సేవలకు ఆపదమిత్రలు సిద్ధం : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

ప్రకృతి వైపరిత్యాల సమయంలో అత్యవసర సేవలందించేందుకు ఆపదమిత్రలు సిద్ధంగా ఉన్నారని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో పదో బెటాలియన్ ఎన్‌డిఆర్ఎఫ్ బృందం ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆపదమిత్రలకు నిర్వహించిన అవగాహన, శిక్షణా కార్యక్రమంలో కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఆపదమిత్రలు శిక్షణ ద్వారా పొందిన విషయాలను ప్రజలకు, పాఠశాలలో విద్యార్థులకు, పరిశ్రమల్లో సిబ్బందికి, ప్రతిఒక్కరికి అవగాహన కల్పించడంతోపాటు, మాక్ డ్రిల్ ప్రదర్శించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరికోసమో ఎదురు చూసే పరిస్థితి ఉండకూడదనే లక్ష్యంతోనే ఆపదమిత్రలకు శిక్షణ ఇచ్చామన్నారు. వారు తక్షణం స్పందించి ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ చర్యలు చేపడితే ప్రాణనష్టం లేకుండా చూస్తారన్నారు. వీటితో పాటు ఫైర్, మెడికల్, విద్యుత్, పోలీస్, రెవెన్యూ తదితర శాఖలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో యలమంచిలి, నరసాపురం, ఆకివీడు, భీమవరం, ఆచంట, పెంటపాడు, మొగల్తూరు, పెనుగొండ మండలాల్లో ఎంపిక చేసిన 247 మంది యువతీ, యువకులకు ఆపదమిత్రలుగా శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం బెటాలియన్ బృందసభ్యులు ఎంవిఆర్.నాయుడు, ఎన్.రామారావు, జి.శంకర్‌రావు, ఆర్.కుమార్‌రాజా, ఎస్.ఆదినారాయణ ఆపదమిత్రలకు ప్రమాదాలను ఎదుర్కోవడంలో అవగాహన కల్పిస్తూ, స్వయంగా వారిచే ప్రాక్టికల్స చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ ఎమ్‌డి.నజీముల్లాషా, బిసి, ఎస్‌సి, ఎస్‌టి శాఖల జిల్లా అధికారులు, ఆపదమిత్రలు పాల్గొన్నారు.

దంపతుల ప్రాణాలను కాపాడిన 10వ ఎన్ డి ఆర్ ఎఫ్ బందం

పదో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం నరసాపురంలో అవగాహన కార్యక్రమాన్ని ముగించుకొని భీమవరం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న సందర్భంలో మార్గమధ్యలో పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల వద్ద పి.వేణుగోపాల్(40), సంధ్య (30) దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన వీరిని తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. విషయాన్ని గమనించిన ఎన్‌డిఆర్ఎఫ్ బృందం ఆ దంపతులకు ప్రథమ చికిత్స చేసి, దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

'చిరిగిపోయిన చొక్కా అయిన తొడుక్కో... కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో' అనేది మేధావులు చెప్పిన మాట అని, విద్యార్థులకు అవసరమైన విజ్ఞానాన్ని అందించేవి పుస్తకాలేనని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటచారి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమవరం వైఎస్ఆర్ శాఖా గ్రంథాలయానికి సుమారు రూ.40 వేల విలువ కలిగిన పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ విద్యావంతులు, మేధావులు తమ తీరిక సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాల్లోని పుస్తకాల అధ్యయనం ద్వారా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని, నిరుద్యోగులకు సంబంధించిన పుస్తకాలు అందు బాటులో తీసుకుని వచ్చి ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఎంసెట్, ఇంజినీరింగ్, గ్రూపు-1, సివిల్స్ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలను అందించడం గొప్ప విషయమని, విద్యార్థులు గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆధునికయుగంలో సౌకర్యాలెన్ని పెరిగినా విద్యార్థులకు, ఉద్యోగులకు, నిరుద్యోగులకు విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారంగా ఉంటున్నాయని, వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పబ్లిక్ సర్వీసు కమిషన్, సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు సంబంధించినవి, ఎన్‌డిఎ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే సర్వీసు ఉద్యోగాలకు సంబంధించి అవసరమైన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల పేరిట అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, సుమారు రూ.40 వేలు విలువ కలిగిన వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మోర్చ అధ్యక్షులు అల్లూరి సాయిదుర్గరాజు, చెరుకువాడ వెంకట్రామయ్య, అల్లు శ్రీనివాస్, వారణాసి రాధాకృష్ణ పాల్గొన్నారు.

పుస్తకాలు అందిస్తున్న ఆర్‌డిఒ

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు

నోడల్ అధికారుల నియామకం

ఏలూరు:ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి, భద్రతలు, విఎంఅండ్‌జిల్లా సెక్యూరిటీ ప్లాన్ నోడల్ అధికారిగా ఎస్ఇబి అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఓటర్ల జాబితా నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ కెవిఎస్ఆర్.రవికుమార్, బైయాన్యూల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ కెవిఎస్ఆర్.రవికుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎన్.బాలకృష్ణన్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, బ్యాలెట్ పేపరు బ్యాలెట్ బాక్సుల నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ కెవిఎస్ఆర్.రవికుమార్, ఏలూరు డిఎల్‌డిఒ రమణ, హెల్ప్ లైన్, ఫిర్యాదుల పరిష్కారం నోడల్ అధికారిగా జెడ్‌పి సిఇఒ, ఎన్నికల శిక్షణా నిర్వహణ నోడల్ అధికారిగా ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారిగా డ్వామా పీడీ రాంబాబు నియమితులయ్యారు. మ్యాన్ పవర్ మేనేజ్ మెంట్ నోడల్ అధికారిగా డిఇఒ ఎన్‌వి.రవిసాగర్, మెటీరియల్ మేనేజ్ మెంట్ నోడల్ అధికారిగా ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా జిల్లా రవాణా కమిషనరు ఎం.పురేంద్ర, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటి నోడల్ అధికారిగా జిల్లా ఇన్ఫర్మెటిక్ ఆఫీసరు(ఎన్ఐసి) జివిఎస్ఆర్.శర్మ, మీడియా కమ్యూనికేషన్ నోడల్ అధికారిగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని, పిఆర్ఒ ఆర్.రామచంద్రరావు, ఎన్నికల అబ్జర్వర్స్ నోడల్ అధికారిగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎన్.బాలకృష్ణన్, ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి నివేదికలు, కమ్యూనికేషన్స్ కోసం నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్ల నోడల్ అధికారిగా నరసాపురం సబ్ కలెక్టర్‌తోపాటు కొవ్వూరు, ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలను నియమిస్తూ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత నోడల్ అధికారులు తమకు నిర్దేశించిన విధులను ఎన్నికల నిబంధనల మేరకు నిర్వర్తిస్తూ సకాలంలో సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు

భీమవరం జిల్లాలో గృహనిర్మాణ లబ్ధిదారుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణం పొంది, గృహనిర్మాణం పూర్తయినా ఇంకా బిల్లులు రాని లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి 89199 60056, 96207 36789 ఫోన్ నెంబర్లను ఏర్పాటు చేశామన్నారు.

నూరుశాతం ఇ-క్రాప్ నమోదు పూర్తిచేయాలి

అత్తిలి:ఇ-క్రాప్ నమోదు నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను, ఆర్‌బికె సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కంచుమర్రు రైతుభరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోపు ఇ-పంట నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బికెల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇకపైనై, ఇ-పంట నమోదు పూర్తికాకపోతే ప్రభుత్వ పథకాల లబ్ధి, ఇతర రాయితీలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్యను పరిష్కరించాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పాలకోడేరు

వరి పొలాలు కీలక దశలో ఉన్న నేపథ్యంలో సాగునీరు లేక చేలు ఎండిపోవడం బాధాకరమని, తక్షణం సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అధికారులను ఆదేశించారు. మైప, కోరుకొల్లు, మోగల్లు గ్రామాల్లో ఎంఎల్‌ఎ రామరాజు పర్యటించి వరి పొలాలను బుధవారం పరిశీలించారు. కోరుకొల్లు, స్కిన్నెరపురం, మోగల్లు, దక్షిణకాలువ, రేలంగి ఛానల్ కాలువలను, వాటి పరిధిలో ఉన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో రైతులు పలు సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చారు. వంతులవారీ విధానం కొనసాగుతోందని, అయినా శివారు ప్రాంత పొలాలకు నీరు అందట్లేదని, పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంఎల్‌ఎ రామరాజు తణుకు సబ్ డివిజన్ ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్, అత్తిలి సెక్షన్ ఎఇ అనిల్‌తేజతో మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం డీజిల్ అందిస్తే రైతులు ఇంజిన్ సహాయంతో నీళ్లు తోడుకుంటారని చెప్పారు. తక్షణం సాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతికి సమస్యను ఫోన్లో తెలిపారు. ఎంఎల్‌ఎ వెంట నాయకులు గాదిరాజు శ్రీనివాసరాజు, కలిదిండి వెంకట సత్యనారాయణ రాజు, కలిదిండి రామకృష్ణంరాజు, గొట్టుముక్కల రామాంజనేయరాజు పాల్గొన్నారు.

వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ రామరాజు

ఏప్రిల్ 5న రైతు, కార్మిక సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏప్రిల్ 5వ తేదీన రైతు, కార్మిక సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 37వ వార్షికోత్సవం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. 2022వ సంవత్సరం కార్యకలాపాల రిపోర్టును యూనియన్ కార్యదర్శి జనాలు దానయ్య ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని, శానిటేర్ వర్కర్లకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా విభజించడం దుర్మార్గమన్నారు. ఏప్రిల్ 5వ తేదీన చేపట్టనున్న రైతు, కార్మిక సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కర్రి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా కొడమంచిలి బాబు, గొడవ మిస్సమ్మ, ప్రధాన కార్యదర్శిగా ధనాల దానయ్య, జాయింట్ సెక్రటరీగా కోరిక సుబ్బారావు, కోశాధికారిగా సిర్రా శ్రీనివాస్‌ను, మరో 17 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మడకా రాజు, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, ఎబి.శ్రీనివాస్, ధనాల దానయ్య, ధనాల వెంకట్రావు, సిర్రా శ్రీనివాస్, కె.దయామణి పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై ప్రత్యేక దృష్టి : ఇన్‌ఛార్జి డిపిఒ

పెదఅమిరం పంచాయతీలో తనిఖీలు

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలో పన్నుల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించామని ఇన్‌ఛార్జి జిల్లా పంచాయతీ అధికారి ఎన్.నాగలత అన్నారు. పెదఅమిరం గ్రామ పంచాయతీలో ఇన్‌ఛార్జి డిపిఒ నాగలత ఆకస్మిక తనిఖీలు బుధవారం నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వసూలు కానీ ఇంటి, కుళాయి పన్నులపై ఆరాతీశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. పంచాయతీ గ్రామ కార్యదర్శి కనకారావు సెలవు పెట్టారు. మార్చి మొదటి వారంలో విధులకు హాజరుకానున్నారు. ఇప్పటివరకూ గ్రామంలో ఇంటి పన్నులు 60 శాతం, కుళాయి పన్నులు 44 శాతం పూర్తి అయ్యాయి. గ్రామంలో పేరుకుపోయిన బకాయిల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ చూపి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. మార్చి 31వ తేదీలోపు వసూలు చేసే విధంగా ప్రణాళికను రూపొందించుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో 368 గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల డిమాండ్ రూ 23 కోట్ల 77 లక్షలు. ఇప్పటివరకూ రూ.16.20 కోట్లు వసూలైనట్లు తెలిపారు. రూ.7.57 కోట్లు వసూళ్లు కావాల్సి ఉందన్నారు. త్వరితగతిన ఇళ్ల యజమానులతో మాట్లాడి పెండింగ్ పన్ను బకాయిలను వసూళ్లు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పంచాయతి అధికారులకు సూచించమన్నారు. ఈ తనిఖీల్లో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, ఇఒఆర్‌డి ఎంవి.భాస్కరరావు, సచివాలయ కార్యదర్శి సత్యనారాయణ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదఅమిరం గ్రామ పంచాయతీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఇన్‌ఛార్జి డిపిఒ

తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సూర్యమిత్ర ఆక్వా పరిశ్రమలో తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యనమదుర్రులో ఆక్వా పరిశ్రమ డ్రైవర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బుధవారం శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యనమదుర్రులో గ్రామంలో సూర్యమిత్ర ఆక్వా ప్లాంట్‌లో 15 ఏళ్లుగా డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముఖ్యపాత్ర పోషిస్తున్న డ్రైవర్లకు ట్రిప్పులకు ఇచ్చే బేటాలను ఏకపక్షంగా తగ్గించారని, ఇదేంటని అడిగినందుకు అన్యాయంగా డ్రైవర్లను విధుల నుంచి తొలగించారని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పాత పద్ధతిలోనే బేటాలు ఇవ్వాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో వి.శ్రీనివాస్, సిహెచ్ రామకృష్ణ, కె.సురేష్, పంపన కోటేశ్వర్లు పాల్గొన్నారు.

దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న శ్రీనివాస్

గృహ సారధులే జగనన్న రథసారధులు

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గృహ సారధులే ముఖ్యమంత్రి జగనన్న రథసారధులని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. కన్వీనర్లు, గృహ సారధులపై గురుతర బాధ్యత ఉందని, అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని, తద్వారా రాజకీయంగా ఎదగాలని ఎంఎల్‌ఎ ఆకాంక్షించారు. బుధవారం ఎఎంసి కార్యాలయ ప్రాంగణంలో భీమవరం వన్‌టౌన్‌కు సంబంధించి కన్వీనర్లు, గృహ సారధులతో జరిగిన సమావేశంలో ఎంఎల్‌ఎ మాట్లాడారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును వివరించాలన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు కన్వీనర్లు, గృహ సారధులు ఆ బాధ్యత వహించాలన్నారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో గత మూడున్నర సంవత్సరాలుగా చూస్తే 98 శాతానికి పైగా హామీలను అమలు చేసినట్లు తెలిపారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయడంలో ముఖ్యమంత్రి ఎక్కడా వెనుకడుగు వేయలేదన్నారు. ప్రజల వద్ద డబ్బులు ఉంటే రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం అవుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు చేస్తున్న అసత్య ప్రచారాలను, అదే మాదిరిగా చంద్రబాబును అధికారంలోకి ఏదో విధంగా తీసుకురావాలనే తపనతో ఉన్న మరో పార్టీ నాయకుడి ప్రచారాలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వన్‌టౌన్ జెసిఎస్ కన్వీనర్ నల్లం రాంబాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, త్రీటౌన్ కన్వీనర్ చెల్లబోయిన సూర్యప్రకాష్, తోట భోగయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

కల్లుపాక పీకితే ప్రజా ఉద్యమమే

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరంలో కల్లుపాక పీకితే ప్రజా పోరాటం తప్పదని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తుగ నరసింహమూర్తి హెచ్చరించారు. బుధవారం కల్లుపాక వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎవరికి ఇటువంటి అభ్యంతరం లేని ఆర్‌అండ్‌బి రహదారికి 20 అడుగుల దూరంలో చిన్న పాక వేసుకుని కల్లు అమ్ముకుంటున్న బొంతు పెద్దిరాజు, మారమ్మతో కల్లుపాక పీకేస్తామని పాలకులు బెదిరించడం దారుణమన్నారు. అధికార పార్టీకి చెందిన కట్టా సత్యవతి కల్లుపాక తీసేయాలని అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక నాయకులు నేడు రేపో తొలగిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజును బాధితులు, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు నాలుగు సార్లు కలిశామని, పాకను పీకొద్దని సర్పంచి సమక్షంలో చెప్పిరని తెలిపారు. అయితే సర్పంచి జక్కంశెట్టి చంటి పిటీషన్ వేశిన కట్టా సత్యవతిని వెనకేసుకు రావడం భావ్యం కాదని తెలిపారు. సర్పంచికి చేతనైతే పంచాయతీ ఏరియాలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తిచేశారు. సర్పంచి పరోక్షంగా బొంతు పెద్దిరాజు కుటుంబాన్నీ అప్రతిష్ట పాలు చేయాలని చూడడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి బొంతి శ్రీనివాస్, జిల్లా నాయకులు బొక్కా చంటి, సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, సిఐటియు జిల్లా నాయకులు పిల్లి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం కౌరు సుబ్బారావు, మామిడిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

ఆచంట వేమవరంలో నిరసన తెలుపుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తుగ నరసింహమూర్తి, నాయకులు

హరిబాబును పరామర్శిస్తున్న ఎంఎల్ఎ నిమ్మల

హరిబాబుకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎపి ఎన్‌జిఒ అధ్యక్షుడు గుడాల హరిబాబును ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బుధవారం పరామర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో గుండె చికిత్స చేయించుకుని తిరిగొచ్చిన హరిబాబును ఆయన పరామర్శించారు. కోవిడ్ సమయంలో ఎంతో మందికి సేవలందించిన హరిబాబుకు బైపాస్ జరగడం బాధాకరమన్నారు. హరిబాబు కోలుకుని మరిన్ని సేవలందించాలని రామానాయుడు కోరారు. వీరితోపాటు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, బోణం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు ఉన్నారు.

మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న సొసైటీ ఛైర్ పర్సన్ సత్యనారాయణ

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - ఆచంట

డ్వాక్రా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పెరటి కోళ్ల పంపిణీ చేసినట్లు సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ తెలిపారు. కొడమంచిలి సచివాలయం వద్ద డ్వాక్రా గ్రూపుల మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. మహిళలు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో కోళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలు బాధ్యతగా కోళ్లను పెంచి అన్ని విధాలుగా లాభపేక్ష చెందాలని కోరారు. కొడమంచిలిలో సుమారు 15 యూనిట్లు ఏర్పాటు చేసినట్లు డ్వాక్రా సిసి మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ కొండేటి రమేష్, బొరుసు రాంబాబు, వైసిపి నాయకులు పోలిశెట్టి వనమరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు సాక సురేష్ పాల్గొన్నారు.

పాలకొల్లులో కురుస్తున్న మంచు

పాలకొల్లులో మంచు దుప్పటి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో మంచు తీవ్రత పెరిగింది. బుధవారం తెల్లవారుజాము నుంచి మంచు ఎక్కువగా పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మహాశివరాత్రి తరువాత సాధారణంగా మంచు ప్రభావం తగ్గుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి.

సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు తెలిపారు. పెనుగొండలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు బుధవారం పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మరోసారి ఆయనను దీవించాలని కోరారు. ఆయన వెంట వైసిపి కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రఘురామ్‌కు జెడ్‌పి ఛైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి - పాలకొల్లు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎంఎల్‌సి తలశిల రఘురాం భార్య స్వర్ణకుమారి పెద్దకార్యంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం రఘురాం స్వగృహం విజయవాడలోని గొల్లపూడి చేరుకుని స్వర్ణకుమారికి నివాళులర్పించారు. రఘురాంను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ కూడా ఉన్నారు.



ఎంఎల్‌సి రఘురామ్‌ను పరామర్శిస్తున్న జెడ్‌పి ఛైర్మన్

ప్రమాదం జరిగితే అంతే..!

నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం - అగ్నిమాపక పరికరాలు నిల్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజ కవర్గంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అయితే అందుకు తగ్గట్టుగా అగ్నిమాపక పరికరాలు మాత్రం ఉండడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్టుమెంట్లలో అగ్ని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీసం అపార్టుమెంట్ చుట్టూ అగ్నిప్రమాద వాహనం తిరిగే పరిస్థితి కూడా ఉండడం లేదు. గత మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, టిపిఒ పార్థసారధి ఇష్టానుసారం పట్టణంలో అపార్టుమెంట్ల నిర్మాణాలకు అనుమతిచ్చారనే విమర్శలు ఉన్నాయి. అపార్టుమెంట్లకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అగ్నిమాపక, పోలీస్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం లేదు. అసలు అగ్నిమాపక శాఖకు సంబంధం లేకుండానే మున్సిపాల్టీ అపార్టుమెంట్ల నిర్మాణానికి అనుమతినిస్తోందని పలువురు చెబుతున్నారు. పాలకొల్లు పట్టణ, రూరల్ పంచాయతీ, ఆచంట, నరసాపురం నియోజకవర్గంలో ఎక్కడికక్కడ అపార్టుమెంట్ల నిర్మాణం పెరిగిపోతోంది. రూ.50 నుంచి రూ.70 లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నా అగ్నిప్రమాదం జరిగితే రక్షణ చర్యలు మాత్రం శూన్యం.

పాలకొల్లులో నిర్మిస్తున్న అపార్టుమెంట్

పాలకొల్లు అగ్నిమాపక కేంద్రంలో కేవలం 2 వాహనాలు ఉన్నాయి. 4 సంవత్సరాల కిందట మిస్ట్ వెహికల్ అంటూ అగ్ని ప్రమాదాలు జరిగితే సందుల్లో సైతం వెళ్లి మంటలను ఆర్పేందుకు మోటార్ సైకిల్ ఉండేది. దీన్ని జిల్లా రాజధాని భీమవరానికి తరలించారు. దీంతో పట్టణంతో పాటు రూరల్ ప్రాంతంలో పెరిగిన అపార్ట్మెంట్లలో ఏదైనా ప్రమాదం జరిగితే బూడిద తప్ప అగ్నిమాపక సిబ్బంది చేతులెత్తే పరిస్థితి నెలకొంది.

పాలకొల్లు రూరల్‌లో నిబంధనలకు విరుద్ధంగా నాన్ లేఅవుట్లలో నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. మున్సిపల్, పంచాయతీ అధికారులకు మాత్రం కాసుల వర్షం కురుస్తోందని పలువురు బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఆచంటలో ఫైర్ స్టేషన్ నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. దీంతో పాలకొల్లు ఫైర్ స్టేషన్‌పై ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం తాటాకిళ్ల నిర్మాణం తగ్గినా విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం పెరగడంతో షార్ట్ సర్క్యూట్ సమస్య ఏర్పడింది. దీంతో ఏ అంతస్తులో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ముఖ్యంగా బహుళ అంతస్తుల్లో స్కూళ్లు, కాలేజీలు, ఆసుపత్రులు నడపడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రంగా ఉంటోంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొడమంచిలిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు టిడిపి చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ప్రజల్లో అనూష్య స్పందన లభిస్తోందని టిడిపి యువత ఆచంట నియోజకవర్గ కార్యదర్శి బాలం వెంకటరమణ అన్నారు. కొడమంచిలి పంచాయతీపరిధి జక్కంశెట్టివారిపాలెంలో బుధవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం చేపట్టి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక ధర పెరగడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సామాన్య మధ్యతరగతి ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి చిలుకూరి శ్రీను, చిలుకూరి చంటి, వెంకటేశ్వర సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరులో ప్రజలతో మాట్లాడుతున్న టిడిపి నేతలు

మొగల్తూరు: రానున్న ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడం ఖాయమని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటిపాలెంలో బుధవారం సాయంత్రం పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి విధానాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. చంద్రబాబు పాలనతోనే తమ బతుకులు బాగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మామిడిశెట్టి సత్యనారాయణ, పాలా రాంబాబు, పెచ్చేటి నాగేశ్వరరావు, బొల్ల చంటి, డోల్లారత్నం రాజు పాల్గొన్నారు.

విద్యతోనే సమగ్రాభివృద్ధి : డిఇఒ

ఘనంగా విస్సాకోడేరు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 22వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యలో మెలకువలు పాటిస్తే అత్యుత్తమ శిఖరాలకు వెళ్లడంతో పాటు అటు సమాజం, ఇటు వ్యక్తిగత సమగ్ర అభివృద్ధికి సాధ్యమవుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ అన్నారు. విస్సాకోడేరులో సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 22వ వార్షికోత్సవం స్కూల్ ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గ్రామ సర్పంచి బోల్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామంలో చిన్న స్కూల్ గా ఏర్పాటు చేసిన సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు దినదినాభివృద్ధి చెందుతూ 22 ఏళ్లుగా విద్యా వ్యవస్థలో నిలదొక్కుకోవడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయిని స్వర్ణలత తనకు అత్యంత సన్నిహితులని తెలిపారు. అనేక కార్పొరేట్ పాఠశాలలు ఉన్నప్పటికీ వాటికి దీటుగా గ్రామంలో విద్యపై మమకారంతో విద్యా సేవలందిస్తున్న డాక్టర్ స్వర్ణలత వారి లక్ష్యానికి అనుగుణంగా గ్రామం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమణ మాట్లాడుతూ విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భీమవరం ఉప విద్యా శాఖ అధికారి డి.శ్రీరామ్ మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం యాజమాన్యం గొప్పతనమన్నారు. గొరగనమూడి, పెన్నాడ సర్పంచులు గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు), చిల్లా అనూష సత్యనారాయణ, ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీతులసి మాట్లాడారు. అనంతరం వారందరినీ స్కూల్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయిని స్వర్ణలత, స్కూలు ఫౌండర్ పీజే రాజశేఖర్ బాబు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మాజీ ప్రిన్సిపల్ టెన్నిసన్, కరస్పాండెంట్ పి.రిచి జాన్ కిడ్స్, ఉపాధ్యాయులు పి.హర్షిత, మాజీ ఎంపిటిసి గడ్డం జోషి, కొండపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారిని సత్కరిస్తున్న హైస్కూల్ యాజమాన్యం, సిబ్బంది

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గేయాలు, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా నృత్యాలు, సినీ గేయాలకు డాన్సులతో విద్యార్థులు అలరించారు. విద్యార్థులు వేసిన నాటిక అందనీ ఆకట్టుకుంది. అనంతరం సర్పంచి బొల్ల శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

విద్యను పంచడమే లక్ష్యం : హెచ్‌ఎం స్వర్ణలత

విద్యపై నాకు ఎంతో మమకారం ఉంది. దాని విలువ నాకు తెలుసు. గ్రామీణ ప్రాంతాలలో విద్యను పదిమందికి పంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను. 22 ఏళ్లగా విద్యా వ్యవస్థలో ఎంతోమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడం గర్వంగా ఉంది. స్కూలు స్థాపించిన నాటి నుంచి తన భర్త స్కూల్ ఫౌండర్ పీజే రాజశేఖర్ బాబు తన వెంట ఉండి స్కూల్ అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. అనంతరం డాక్టర్ స్వర్ణలతన స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించండి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. బుధవారం మహదేవపట్నం గ్రామ పరిధిలోని రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏ విధమైన పరీక్షలు నిర్వహిస్తారో అదేవిధంగా రోగులకు వివిధ పరీక్షలను నిర్వహించి వారికి కావాల్సిన మందులను అందించడం జరుగుతుందన్నారు. గర్భిణులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈ కార్యక్రమంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఐసి కీర్తన, 104 డాక్టర్ నరసరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఉండి

వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని ఎఎస్ఐ అడబాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కోలమూరులో ఎఎస్ఐ అడబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం అనే చిన్న నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదం జరిగితే విలువైన ప్రాణాలను కోల్పోతారన్నారు. రోడ్డు ప్రమాదంలో సుమారు 72 శాతం మంది యువకులు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. వాహనదారులు హెల్మట్ ధరించాలని కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎస్ఐ రామచంద్రరావు సేవలు అభినందనీయం

సిఐ నాగప్రసాద్

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు ఎస్ఐ రామచంద్రరావు చేసిన సేవలు అభినందనీయమని భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్ అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో పాలకోడేరు ఎస్ఐగా పనిచేసి భీమవరం బదిలీపై వెళ్లిన రామచంద్రరావుకు వీడ్కోలు, అభినందన సభ బుధవారం రాత్రి ప్రస్తుత ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది, మహిళా పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఐ నాగప్రసాద్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం ముళ్లబాటైనప్పటికీ దాన్ని సమర్ధవంతంగా రామచంద్రరావు నిర్వర్తించారన్నారు. మండల ప్రజానీకానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.శ్రీనివాస్‌రావు, ఎఎస్ఐ శ్రీనివాస్‌రావు, కానిస్టేబుల్ చంద్ర, తేజ, శ్రీనివాసు, రవి, నాగరాజు, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, ధనుంజయ రాజు, మాణిక్యాలరావు, ప్రసాద్, మహేంద్ర, మహిళా పోలీసులు అనూష, పూర్ణిమ పాల్గొన్నారు.

ఎస్ఐ రామచంద్రరావును సత్కరిస్తున్న మహిళా పోలీసులు

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాల్లోని వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కుక్కలవారితోటలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి వార్షిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రస్థాయి ఆటల, సాంస్కృతిక పోటీల్లో తమ సిబ్బంది 11 బహుమతులు గెలుచుకున్నట్లు మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. బుధవారం సంస్థలో గతవారం తిరుపతి వ్యవసాయ కళాశాలలో ఆచారి ఎంజీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సిబ్బందికి జరిగిన రాష్ట్రస్థాయి ఆటలు, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన మండల సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

ప్రజాశక్తి - కాళ్ల

రైతులకు వ్యవసాయ యాంత్రాలు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై అందిస్తోందని, వాటికోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చామర్తి జయవాసుకీ అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో రబీ 4,297 ఎకరాల్లో సాగవుతోందన్నారు. గతేడాది కంటే ఈసారి రబీ సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. పంటపొలాలను ఆక్వా చెరువులుగా మార్చేయడంతో వరిసాగు క్రమంగా తగ్గిందన్నారు. డ్రోన్లు 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రతి మండలానికీ మూడు డ్రోన్లు అందించడం జరుగుతుందన్నారు. ఎంపిక చేసుకున్న వారికి ప్రభుత్వం డబ్బులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కృషి ట్రాక్టర్లు, స్ప్రేయర్లు 40 శాతం సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురుగుమందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

గుమ్మలూరులో బాల్య వివాహం అడ్డగింత

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - పోడూరు

గుమ్మలూరు గ్రామంలో బుధవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డుకున్నారు. విఆర్ఒ బి.లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం గుమ్మలూరు తూర్పు కాలువ గట్టుకు చెందిన 17 సంవత్సరాల బాలిక పెనుమదం గ్రామానికి చెందిన యువకుడు (27) కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. దీంతో ఇరుకుటుంబాల వారు వివాహం చేయాలని నిర్ణయించారు. స్థానిక సచివాలయం కార్యదర్శి వర్మ ఇచ్చిన సమాచారంతో మహిళా పోలీసు శ్రావణి సమక్షంలో వారికి బాల్య వివాహ చట్టరీత్యా నేరమని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరుకుటుంబ సభ్యులతో హామీ పత్రాలు రాయించుకుని వివాహ కార్యమాన్ని నిలిపివేయించారు. వారికి మైనార్టీ తీరాక వివాహం చేయాలని సూచించారు.

తనపై బురదజల్లేందుకే బైఠాయింపు

సర్పంచి బుర్రా రవికుమార్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఓడూరు పంచాయతీ ఎదుట తనకు న్యాయం చేయండంటూ వాలంటీర్ బైఠాయించిన ఘటనపై గురువారం సర్పంచి బుర్రా రవికుమార్ స్పందించారు. వాలంటీర్ గృహ నిర్మాణానికి సంబంధించిన సామగ్రి తరలించేందుకు కాలినడక దారి మాత్రమే ఉందని తెలిపారు. రోడ్డు మార్గం చాలా ఇరుగ్గా ఉందని, ఒకవైపు వాటర్ పైప్‌లైన్, మరోవైపు డ్రెయినేజీ ఉందని తెలిపారు. భారీ వాహనాలు ఆ మార్గంపై వెళ్తే రోడ్డు ధ్వంసం అవుతుందనే ఉద్దేశంతో మరో మార్గం ద్వారా సామగ్రిని తెచ్చుకోవాలని వాలంటర్‌కు సూచించామని తెలిపారు. అయితే ఆమె పంచాయతీ ఎదుట బైఠాయించి గృహ నిర్మాణాలకు ఇబ్బంది పెట్టారని చెప్పిందని తెలిపారు. దీనికి సంబంధించి ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. తనపై బురద చల్లడమే ఉద్దేశంగా తల్లీకూతురు నిశ్చయించుకున్నారని తెలిపారు. గ్రామంలో అందుబాటులో ఉంటుందని వాలంటీర్‌గా ఉద్యోగం ఇప్పించామని తెలిపారు. జగనన్న కాలనీలో పట్టాను ఇచ్చి నిర్మాణానికి కావాల్సిన సదుపాయాలు పంచాయతీ ద్వారా కల్పిస్తూ అన్ని విధాలుగా సహకరిస్తున్నామన్నారు. వాలంటీర్‌కు పట్టా ఇచ్చిన స్థలంలో కాకుండా గ్రామంలో పెద్ద పేటలో ఉన్న సొంత స్థలంలో నిర్మాణం చేసుకుంటోందని సర్పంచి తెలిపారు. అయినప్పటికీ నిర్మాణాన్ని చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814